
సీలింగ్ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

- హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు
- 2008లోనే హైకోర్టు ఆదేశాలు
- రిజిస్ట్రేషన్ల రద్దుకు కలెక్టర్ ఆదేశాలు
- కొత్తపల్లిలోని సర్వే నంబర్ 175, 197, 198లో 476 రిజిస్ట్రేషన్లు రద్దు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తపల్లిలో సీలింగ్ పరిధిలో ఉన్న భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి రియల్ మాఫియా, దళారులు అధికారులతో కలిసి లక్షల్లో దండుకున్నారు. ఈ అక్రమాలపై ముప్పై ఏళ్ల క్రితమే కొందరు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ జరిపించి అవి సీలింగ్ భూములని తేల్చిచెప్పారు. ఆ భూముల్లో ఎలాంటి లావాదేవీలు చేయవద్దని హైకోర్టు అధికారులను ఆదేశించింది. కొందరు వ్యక్తులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో ఆ వ్యవహారం వాయిదాల్లో నానుతూ వచ్చింది. భూముల వ్యవహారం కోర్టులో ఉండగానే కొందరు రియల్ వ్యాపారులు రంగప్రవేశం చేసి అధికారులు, ఇతరుల అండతో ఆ భూముల్లో 476 రిజిస్ట్రేషన్లు చేసి జేబులు నింపుకున్నారు. మళ్లీ ఈ వ్యవహారాన్ని కొందరు లోకాయుక్త దృష్టికి తీసుకువెళ్లగా లోకాయుక్త కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ భూములను సీలింగ్ భూములుగా పేర్కొంటూ కలెక్టర్ ఆయా రిజిస్ట్రేషన్లను రద్దు చేయాల్సిందిగా గంగాధర సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

మూడు సర్వే నంబర్లు.. 456 రిజిస్ట్రేషన్లు

కొత్తపల్లి శివారులోని సర్వే నంబర్ 175, 197, 198 భూములకు సంబంధించిన దాదాపు 465 రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. ఆ భూములు సీలింగ్ లాండ్ కిందకు వస్తాయని, అందులో రిజిస్ట్రేషన్లు చేయవద్దని 1995లో ఒక ఫిర్యాదుపై విచారణ చేయాలని అప్పటి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ చేసిన కలెక్టర్ ఆ భూములన్నీ సీలింగ్ పరిధిలో ఉన్నట్టు హైకోర్టుకి నివేదించారు. దీంతో హైకోర్టు ఆ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని జిల్లా యంత్రాంగానికి సూచించింది. ఆ సమయంలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కోర్టుని ఆశ్రయించారు. అప్పటి నుంచి ఆ భూములు విచారణ దశలోనే కొనసాగుతున్నాయి. ఆ కేసు అలా పెండింగ్ లో ఉండగానే కొంతమంది వ్యక్తులు ఆ భూముల్లో యథేచ్ఛగా లావాదేవీలు జరుపుతున్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఫిర్యాదుతో..

భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై లోక్‌సత్తా ఉద్యమ సంస్థ 2015 సంవత్సరంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన లోకాయుక్త ఆ భూములకు సంబంధించిన లావాదేవీలపై పూర్తి వివరాలు తమకి సమర్పించాలని ఆదేశిస్తూ, ఇక ముందు ఎలాంటి లావాదేవీలు జరపవద్దని రెవిన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. లోకాయుక్త సూచన మేరకు ఆ మూడు సర్వే నంబర్లలో అప్పటివరకు జరిగిన లావాదేవీలను లోకాయుక్తకు రెవిన్యూ శాఖ సమర్పించింది. అనంతరం ఆ భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు రెవిన్యూ శాఖ సూచించింది. ఇంతలో లోకయుక్తాకు ఫిర్యాదు చేసిన లోక్ సత్తా ఉద్యమ సంస్థ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ మరణించడం, లోకాయుక్తలో విచారణ ఆగిపోవడం కబ్జారాయుళ్లకు కలిసి వచ్చింది. ఇదే అదునుగా గంగాధర సబ్‌రిజిస్ట్రార్

(మిగతా 8వ పేజీలో)

గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

కొత్తపల్లికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు 2016 వరకు కరీంనగర్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగాయి. కొత్తపల్లి



సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

మండలం భూములు గంగాధర సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోకి వచ్చిన తరువాత 2018లో లోకాయుక్త ఆర్డర్‌తో ఒక రిజిస్ట్రేషన్ జరిగింది. అప్పటి నుంచి నవంబర్ 2024 వరకు గంగాధరలో 52 అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. అప్రమత్తమైన అధికారులు ఎట్టకేలకు ఈ సర్వె నంబర్లను నిషేధిత జాబితాల్లో చేర్చడంతో 11 నవంబర్ 2024 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగలేదు. అయితే ఈ భూములు నిష దిత జాబితాలో లేకపోవడంతో సదరు వ్యక్తులు తగిన చాలన్ చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని రిజిస్ట్రేషన్ అధికారులు చెప్పుతున్నారు. ఇప్పటి వరకు నిషేధిత జాబితాల్లో పై సర్వె నెంబర్లలో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ ఈనెల 15న గంగాధర సబ్ రిజిస్ట్రార్‌కు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు చేయడానికి కొత్త పల్లి తహసీల్దార్‌తో సంప్రదించి చర్యలు తీసుకోనున్నట్లు గంగాధర సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ నూర్‌ఖాన్ తెలిపారు.

ప్రజావాణికి 319 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 319 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజావాణికి వస్తుంటారని, వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు పూర్తి

- 22 నుంచి పరీక్షలు

కరీంనగర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెంకడ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి పరీక్షలు జరుగనున్నాయి. ఈనెల 25వ తేది ఆదివారం కూడా పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్క నిమిషం నిబంధన ఈ పరీక్షలకు వర్తించదు. జిల్లాలో 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 15,084మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం 10,118 మంది, రెండో సంవత్సరానికి చెందిన 4,966 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన అమలు చేయడం జరుగుతుందని, పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల హాల్ టిక్కెట్స్ ఇంటర్మీడియ్ బోర్డు వెబ్ సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానిని విద్యార్థి స్కాన్ చేయగానే, పరీక్షా కేంద్రం, అడ్రస్ వివరాలు వస్తాయి.

నిలిచిన రహదారుల పనులు

- మంజూరుకాని బిల్లులు
- రెండేళ్లుగా కంకర రోడ్డుపై ప్రయాణం

8

ఎయిర్‌పోర్ట్ తరహాలో కరీంనగర్ రైల్వే స్టేషన్

- ప్రయాణికులకు అందుబాటులోకి మెరుగైన సౌకర్యాలు
- దక్షిణ మధ్య రైల్వే ఏసీఎం శివప్రసాద్



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఏసీఎం శివప్రసాద్

కరీంనగర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్ట్ తరహాలో కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించామని దక్షిణ మధ్య రైల్వే కమర్షియల్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ఆధునీ కరణ పనులను ఆయన రైల్వే అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణి కులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో 30 కోట్లతో పనులు చేపట్టామని, ఆరు బుకింగ్ కౌంటర్లు, రెండు ఎస్క. లేటర్లు, రెండు లిఫ్టులు, పే అండ్ యూస్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. దివ్యాం గుల కోసంవీల్ చైర్ సేవలు, రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్‌తోపాటు అప్రో చ్ రోడ్డు నిర్మించామని తెలిపారు. ఈనెల 22న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తారని తెలి పారు. కార్యక్రమంలో అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ భిక్షపతి, సౌత్ సెంట్రల్ వర్క్స్ జానకిరెడ్డి, కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, కమర్షియల్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ పాల్గొన్నారు.

ఏసీపీ, డీఎస్పీల బదిలీలు

కరీంనగర్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది ఏసీపీ, డీఎస్పీలను బదిలీ చేస్తూడీజీపీ డాక్టర్ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీ (ఫంక్షనల్ వర్టికల్స్)లో పనిచేస్తున్న ఏసీపీ వి మాధవి హుజురాబాద్ ఏసీపీగా బదిలీ అయ్యారు. హుజురాబాద్‌లో పనిచేస్తున్న ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. కరీంనగర్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న డీఎస్పీ ఎస్ సదానందం హుస్నాబాద్ ఏసీపీగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఏసీపీ వి సతీష్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సైనికుల ధైర్య సాహసాలను కళ్లారా చూశాను..

- ఈ సమయంలో కేంద్ర కేబినెట్‌లో ఉండడం నా అదృష్టం
- తిరంగా ర్యాలీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

గణేశ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వర్తిస్తూ భారత సైనికుల ధైర్యసాహసాలను కళ్లారా చూశానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో నరేంద్రమోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగడం తన అదృష్టమని ఆయన అన్నారు. కరీంనగర్ తెలంగాణ చౌక్ నుంచి రాంనగర్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధానికి విరామం ఇచ్చామే తప్ప ముగియలేదని, దేశానికి ఆపదొస్తే టెర్రరిస్టుల అంతు చూసే వరకు విడిచి పెట్టబోమని హెచ్చరించారు. ఆపరేషన్ సింధూర్‌తో మన సైన్యం సత్తా యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. పాకిస్థాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టిన ఘనత మన సైనికులదేనని కొనియాడారు. ప్రధాన మోదీ నాయకత్వ పటిమను ప్రపంచమంతా మెచ్చుకుంటోందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో మన సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేస్తూ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం హిందూ ఏక్తా యాత్ర పాటలు విడుదల చేశారు.

తుప్పు పట్టిన స్తంభాలు.. చేతికందే ఎత్తులో తీగలు



చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగపై టవల్ వేసి నిరసన తెలుపుతున్న రైతులు

గన్నేరువరం, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలను మార్చాలని, చేతికి అందేలా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలంటూ మండలంలోని హన్మాజిపల్లిలో రైతులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాలలో తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు ప్రమా దకరంగా మారాయన్నారు. విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయన్నారు. వరికోయాలంటే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా నిలిపి వేయాల్సి వస్తోందన్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను మార్చాలంటే ఒక్కో స్తంభానికి 1500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను మార్చి, తీగలను సరిచేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు



వల్భాపూర్‌లో రోడ్డుపై ధాన్యం, మక్కలు ఆరబోసిన రైతులకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

హుజూరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ హెచ్చరించారు. సోమవారం హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. రాత్రి వేళల్లో వాహన దారులు అదుపు తప్పి ప్రమాదా లకు గురవుతు న్నారన్నారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయకుండా కల్లాల వద్ద ఆరబోసుకోవాలన్నారు. రైతులపై పోలీసులకు గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని రైతులు కాపాడుకోవాలన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులకు నోటీసులు

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో జమ్మికుంట -కరీంనగర్ ప్రధాన రహదారిపై వరి ధాన్యం, మక్కలు ఆరబోసిన రైతులకు వీణవంక పోలీసులు సోమవారం నోటీసులు అందించారు. రోడ్డుపై ఆరబోయడంతో వరుస ప్రమాదలు జరిగి వాహనాదారులు మృతి చెందుతున్నారన్నారు. వెంటనే కుప్పలు తొలగించాలని నోటీసులు అందించారు. గడిచిన వారం రోజుల్లో ధాన్యం కుప్పలు ఢీకొని మండలానికి చెందిన ఇద్దరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. రోడ్డుపై కుప్పలు తొలగించని వారిపై చట్టపట్టరమైన చర్యలు తీసుకుంటామని ప్రొబేషనరీ ఎస్ఐ సాయికృష్ణ, ఏఎస్ఐ రవి హెచ్చరించారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు బాబు శ్రీనివాస్



ఏకగ్రీవంగా ఎన్నికైన పెటా టీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఎల్లవేళలా సమస్యల పరిష్కారానికి తమ వెంట ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యుల సలహాలు, సూచనల మేరకు ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్ నర్సయ్య, 40 మంది వ్యా యామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకు ముందు పరస్పర బదిలీలపై కరీంనగర్ నుంచి వెళ్లిన వ్యాయామ ఉపాధ్యాయుడు హనుమంతును, కరీంన గర్‌కు వచ్చిన వ్యాయామఉపాధ్యాయురాలు శ్రీలతను సన్మానించారు.

కార్యవర్గం

పెటా టీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షులుగా కే దత్తాద్రి, టి హరికిషన్, వి రూపారాణి, పి శ్రీనివాస్, ఎన్ శ్యామలా దేవి, కె రమాదేవి, డాక్టర్ పి శ్రీని వాస్, జి నిర్మల ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్ రమేష్ కుమార్, వి శ్రీలత, ఎం చంద్ర శేఖర్, వి సూర్య ప్రకాశ్, డాక్టర్ ఎజాజ్ అహ్మ ద్, బిట్ర శ్రీనివాస్, ఎం రమేష్, కె వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. సంఘ కోశాధి కారిగా డి వీర్‌పాల్, సంయుక్త కార్యదర్శులుగా కె రమానంద తీర్థ, బి సత్యనారాయణ, ఇ స్నేహలత, వి ప్రవీణ, బి రాజ్‌కుమార్, డి సత్యానంద్, పి ప్రతిమ ఎన్నికయ్యారు., రాష్ట్ర కౌన్సిలర్లుగా గిన్నె లక్ష్మణ్, ఆర్ నర్సయ్య, డి వీరన్న, సీహెచ్ శ్రీనివాసరావు, ఎం కృష్ణవేణి ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా ఎల్‌వీ రమణ, బి రాజగోపాలాచారిని ఎన్నుకున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు


దిలీప్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రెండవబైపాస్ రహదారిలో సోమవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి శనిగరపు దిలీప్ (27) అనే యువకుడు మృతిచెందగా శనిగరం రాజుకు తీవ్రగాయాలయ్యాయి. మరో యువకుడు శనిగరం అఖిలేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని కస్బెకట్కూరు గ్రామానికి చెందిన దిలీప్, రాజు, అఖిలేష్ ద్విచక్రవాహనంపై గజసింగవరం గ్రామంలో జరిగిన తన సమీప బంధువుల పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని ఆదివారం రాత్రి కావడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గల తన బంధువుల ఇంట్లో నిద్రించారు. దిలీప్ అనేయువకుడు ఓ మైక్రో ఫైనాన్స్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న క్రమంలో వేములవాడకు వెళ్లి విధుల్లో చేరేందుకు సోమవారం ఉదయం 5గంటలకే దిలీప్, రాజు, అఖిలేష్ ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటనుంచి వేములవాడకు వెలుతుండగా వెంకటాపూర్ శివారులో సిరిసిల్ల రెండవ బైపాస్ రహదారిలో అతివేగంగా వెలుతూ బైక్ అదుపు తప్పి కల్వర్టువద్ద ఉన్న రోడ్డుపక్కన గల గోతిలో పడ్డారు. ఈ ప్రమాదంలో దిలీప్, రాజులకు తీవ్రగాయాలయ్యాయి. స్వల్పగాయాలతో బయటపడ్డ అఖిలేష్ ఈ విషయాన్ని వెంటనే 108అంబులెన్స్‌కు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తీవ్రగాయాలతో ఉన్న దిలీప్ మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో రాజు పరిస్థితి విషమించడంతో సిరిసిల్ల, కరీంనగర్ నుంచి మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించారు. దిలీప్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య


లింగయ్య(ఫైల్)

రామగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్‌కార్మికుడు వేముల లింగయ్య(80) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో భార్య మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఒంటరిగా జీవనం సాగిస్తుండడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఇచ్చినఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


రాజేందర్ రెడ్డి (ఫైల్)

పెగడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామంలో సోమవారం ఎడ్ల రాజేందర్‌రెడ్డి(49) అనేరైతు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద తోటిరైతులతో కలసి రాజేందర్‌రెడ్డి గడ్డిని తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడిభార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. రాజేందర్‌రెడ్డికి ఒక కూతురు ఉంది.

ఉత్సవాలకు వేళాయె


విద్యుద్దీపాలంకరణలో అంజన్న ఆలయం

నేడు ఉత్సవాలు ప్రారంభం

కొండగట్టులో ఉత్సవాల ప్రారంభ రోజైన మంగళ వారం భద్రాచలం శ్రీ సీతారామాలయం నుంచి అక్కడి అర్చకులు, అధికారులు పట్టువస్త్రాలు, ఇతర లాంఛనాలు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా కళాకా రులు ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పెద్ద హనుమాన్ జయంతి జరగనున్న నేపథ్యంలో శుక్రవారం వరకు ఆలయంలో ఆర్జిత సేవలను నిలుపుదల చేశా రు. అయితే కొండగట్టులో ఇంకా జయంతి ఏర్పాట్లు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. భక్తుల కోసం రూట్ మ్యాప్ సూచి ఫ్లెక్సీలు పెట్టారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీ యూ మార్గంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

కొండగట్టులో వేడుకలకు అంకురార్పణ

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

22న పెద్ద హనుమాన్ జయంతి

మల్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం రాత్రి అంకురార్పణ చేశారు. ప్రతియేటా హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంను మంగళవారం నుంచి గురువారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు యాగశాలను సిద్ధం చేశారు. చివరి రోజు గురువారం పెద్ద హనుమాన్ జయంతిని దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం అంజన్న ఆలయం, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. హనుమాన్ జయంతి ఉత్సవం ప్రారంభానికి సోమవారం సాయంత్రం యాగశాల శుద్ధి, పుణ్య హవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కొండగట్టుకు ఇలా రావచ్చు..

భక్తులు జగిత్యాల, కరీంనగర్, వేములవాడ రూట్ల నుంచి కొండగట్టుకు చేరుకోవచ్చు. కరీంనగర్ నుంచి దిగువ కొండగట్టు వరకు 35కి.మీ, జగిత్యాల నుంచి 14 కి.మీ, వేములవాడ నుంచి 30కి.మీ దూరం ఉంటుంది. దిగువకొండగట్టు నుంచి, దొంగలమర్రి, జేఎన్‌టీయూ మార్గం నుంచి కూడా కొండపైకి చేరుకోవచ్చు. ఇందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది.


మాల విరమణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

మోహన్‌రావుపేటలో చోరీ

● నాలుగున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామంలోని సింగసురేష్ అనేవ్యక్తి ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు నాలుగున్నరతులాల బంగారం, 10తులాల వెండి అభరణాలతోపాటు రూ.7వేల నగదును ఎత్తుకెళ్లారు. సింగ సురేష్ రెండురోజుల క్రితం మంచిర్యాలజిల్లా కేంద్రంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 10తులాల వెండి అభరణాలతో పాటు రూ.7వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు ఇళ్లలో చోరీ

కోనరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండుఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపినవివరాల ప్రకారం.. కనగర్తి గ్రామానికి చెందిన వంగపల్లి పరశురాములు, వంగపల్లి సత్యావాలు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. ఏ వస్తువులు దొరకకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. బాధితులు సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు చిందరవందర ఉండడం బీరువాను పగలగొట్టి ఉండటంతో దొంగలు పడ్డారని గుర్తించారు.


కనగర్తిలో బీరువా తాళాలు పగలగొట్టి చిందరవందర చేసిన వస్తువులు

పోక్సో కేసులో జైలుశిక్ష

రామగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేసిన కేసులో కొత్తపల్లి రాము అనే యువకుడికి మూడునెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లాస్పెషల్ పోక్సో జడ్జి సునీత సోమవారం తీర్పు ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెంచరాల గ్రామానికి చెందిన బాధితురాలును అదే గ్రామానికి చెందిన రాము వేధింపులకు గురి చేశాడు. బాధితురాలు రామగిరి మండలం పన్నూరులోని అమ్మమ్మ ఇంట్లో ఆశ్రయం ఉంటుంది. ఇది తెలుసుకున్న రాము పన్నూరు చేరుకొని వేధింపులకు గురిచేశాడు. దీంతో రామగిరి పోలీస్‌స్టేషన్‌లో 2021 అక్టోబర్ 19న బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు 354 సెక్షన్(డి) సెక్షన్12 ఆఫ్ పోక్సోయాక్ట్ కింద కేసునమోదు చేశారు. సోమవారం పెద్దపల్లి పోక్సో స్పెషల్ కోర్టులో జరిగిన విచారణలో సరైన సాక్ష్యాధారాలతో నిరూపితం కావడంతో యువకుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బిడ్డను తీసుకెళ్తున్నాడని భర్తపై దాడి

ఎల్లారెడ్డిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డను తీసుకెళ్తున్నాడని ఆగ్రహంతో భర్తపై భార్య దాడిచేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం కిష్టునాయక్ తండాకు చెందిన ధరావత్ స్వప్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన సిద్ది నాగార్జున రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి బిడ్డ అలేఖ్య ఉన్నది. నాగార్జున మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగు తుండడంతో మూడు నెలక్రితం నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. సోమవారం తన భార్య వద్దకు చేరుకుని బిడ్డను తీసుకెళ్తుండగా అడ్డుకున్నారు. బిడ్డను తీసుకవెళ్లద్దని భర్త నాగార్జునను రోడ్డుపైనే చితకబాదింది. నాగార్జున తన బిడ్డను ఇచ్చే వరకు కదలనని రోడ్డుపైనే కూర్చున్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. స్థానికులు వారిని సముదాయించి నాగార్జునను అక్కడి నుంచి పంపివేశారు.

ఉద్యోగినితో అసభ్యంగా ప్రవర్తించిన రిపోర్టర్ అరెస్ట్

కొడిమ్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కొడిమ్యాల మండలం తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశం అనే రిపోర్టర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఉద్యోగినిని మానసికంగా వేధించడం, పత్రికలో తప్పుగా ప్రచురిస్తానని బెదిరించినందుకు గతంలో కేసునమోదు చేశామన్నా రు. కొద్దిరోజులుగా పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకొని కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాలో నలుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమరవాణా కేసులో కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి, దుర్శేడ్ గ్రామాలకు చెందిన నలుగురు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లను తహసీల్దార్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేసిన పాతకేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

జగిత్యాల అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామానికి చెందిన ఆళ్ల రవీందర్ అనే వ్యక్తికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు. గొల్లపల్లి మండలంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై సతీష్ తెలిపారు.

అనుమానమే.. పెను భూతమై!

భార్యను చంపిన భర్త

● కూతుళ్ల ఎదుటే.. కత్తితో గొంతు కోసి దారుణ హత్య
● నిజామాబాద్ జిల్లాలో దారుణం ● మృతురాలు జగిత్యాల జిల్లా వాసి


ముద్దంగుల అంజలి (ఫైల్)

ఆర్మూర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. కన్న కూతుళ్ల ఎదుటే ఆమె గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్‌కు జగిత్యాల జిల్లా మొగిలిపేట్‌కు చెందిన అంజలితో 18ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి స్పందన, ఇందు అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గంగాధర్ జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్లుగా దుబాయి వెళ్తూ వస్తుండేవాడు. కొంతకాలంపాటు సాఫీగా సాగిన వీరి సంసారంలో.. భార్యపై అనుమానంతో ఐదేళ్లుగా గొడవలు మొదలయ్యాయి. గొడవలు రోజురోజుకూ ఎక్కువకావడంతో.. దంపతులిద్దరూ తమకు విడాకులు కావాలంటూ నిజామాబాద్ జిల్లా బోధన్ కోర్టులో దాఖలు చేసుకున్నారు. అయితే కూతుళ్ల చదువు నిమిత్తం అంజలి.. తన మకాన్ని ఇటీవలే ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్‌కు మార్చి.. అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఇదే సమయంలో నెలరోజుల క్రితం గంగాధర్ దుబాయి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. విడాకుల విషయమై.. సోమవారం బోధన్ కోర్టుకు హాజరుకావాలని అంజలికి గంగాధర్ ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో పిల్లలతో కలిసి బోధన్‌కు బయలుదేరిన అంజలిని.. మార్గమధ్యలో నిజామాబాద్ నగర బస్టాండ్‌లో గంగాధర్ కలిశాడు. ఇప్పుడు కోర్టుకు అవసరం లేదని, తిరిగి వెళ్లిపోవాలని చెప్పడంతో అంజలి ఆర్మూర్‌కు వచ్చి తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంది. అప్పటికే ఆమెపై విపరీతమైన అనుమానం పెంచుకున్న గంగాధర్.. అంజలికి తెలియకుండా ఆమెవెంటే ఆర్మూర్‌లోని తనింటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇంట్లోకి చొరబడి అంజలిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డొచ్చిన ఇద్దరు కూతుళ్లను తోసివేసి.. వారి కళ్లెదుటే భార్య గొంతుకోసి దారుణంగా హత్యచేశాడు. పిల్లల అరుపులు విన్న ఇంటియజమాని గదిలోకి వెళ్లగా.. ఈ దృశ్యాన్ని చూసి బయటకు వెళ్లి గేటుకు గడియపెట్టి పోలీసులకు సమాచారం అందించాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య, ఏఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలిం చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● కన్నీరు మున్నీరైన ఇద్దరు కూతుళ్లు..

తమ కళ్లముందే తల్లి అంజలిని తండ్రి గంగాధర్ కత్తితో నరికి చంపడంతో.. వారి ఇద్దరు కూతుళ్లు స్పందన, ఇందు కన్నీరు మున్నీరయ్యారు. పెద్దకూతురు స్పందన తల్లితో ఉంటూ చేదోడువాదోడుగా ఉండగా.. చిన్న కూతురు ఇందు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల వేసవి సెలవులు రావడంతో 20 రోజుల క్రితమే ఆర్మూర్‌లోని పెద్దబజార్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని తల్లీ కూతుళ్లు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం తమను ప్రేమగా చూసుకోవాల్సిన తండ్రే ఇంతటి దారుణానికి పాల్పడడంతో.. తల్లిని రక్షించుకోలేకపోయామంటూ గుండెలవిసేలా విలపించారు. తల్లి మరణంతో ప్రస్తుతం తామిద్దరం అనాథలమయ్యామంటూ వారు రోదించిన తీరు చూపరులతో కంటతడి పెట్టించింది.

పచ్చునూర్‌లో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

మానకొండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పచ్చునూర్ గ్రామంలో కుళ్లిపోయిన స్థితిలో ఓవ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైందని సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..పచ్చునూర్ గ్రామానికి చెందిన బత్తుల అజయ్ వద్ద కొన్నేళ్లుగా ఆంజనేయులు (45) అనేవ్యక్తి పనిచేస్తున్నాడు. ఇటీవల పని కోసం గ్రామానికి వచ్చి వెళ్లిపోయాడు. కాగా గ్రామ శివారులోని కోసిన వరి పొలంలో కుళ్లిన, దుర్వాసన వస్తున్న స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్థుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహం ముఖాన్ని కుక్కలు పీక్కుతున్నట్లు ఉందన్నారు. గ్రామకారోబార్ కురాకుల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శవపంచనామా చేసి మృతుడి పూర్తి వివరాల కోసం పోస్టుమార్టం గదిలో భద్రపరుస్తున్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితం విరక్తిచెంది యువకుడి ఆత్మహత్య


దీకొండ సంపత్(ఫైల్)

ధర్మారం, మే 19 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితోపాటు షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సంపత్ (25) అనే యువకుడు కొంత కాలంగా షుగర్ వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. హాస్పిటల్స్‌లో చూపించిన ఎంతకూ తగ్గక పోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంపత్ తల్లి దీకొండ సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. లక్ష్మన్ తెలిపారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానిక సంతోష్‌నగర్ ఏరియాలో ఒక ఇంట్లో గంజాయి విక్రయించడంతోపాటు గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం తెల్లవారు జామున తనిఖీ చేయడంతో ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధ దంపతులపై దాడి

చందుర్తి మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో తులం బంగారు గొలుసు పోయిందని ఓ వృద్ధ దంపతులపై కుమారుడి అత్తింటి వారు దాడికి దిగిన సంఘటన చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన నీరటి మల్లయ్య-అమృతమ్మ అనే దంపతులు గ్రామంలోని బస్టాండ్‌లో టీహోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఒక్కగానొక్క కుమారుడైన సుధీర్‌కు ఏడునెలల క్రితం వేములవాడ అర్బన్ మండలంలోని ఇంద్రనగర్ చెందిన యువతితో వివాహం జరిపించారు. వీరికి కుమారుడు, కోడలితో పలుమర్లు గొడవ జరగగా గ్రామస్థులు సర్ది చెప్పారు. నాలుగురోజుల క్రితం తన భార్య బంగారం పోయిందని, కుమారుడు తల్లిదండ్రుల మీద అభియోగం మోపాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు కులపెద్దలు గ్రామస్థుల సమక్షంలో పవిత్రగ్రంథంపై ప్రమాణం చేసినా నమ్మని కుమారుడు, ఈవిషయంపై అత్తింటి వారికి సమాచారం ఇచ్చాడు. ఆదివారం రాత్రి ఇందిరానగర్‌కు చెందిన అత్తింటి వారు నెంబర్ ప్లేట్ లేని కారుతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాల్లో దాదాపు 15మంది వ్యక్తులు మూడపెల్లి గ్రామానికి చేరుకొని వృద్ధదంపతులపై దాడికి పాల్పడడంతో వృద్ధులు స్పృహ కోల్పోయారు. ఇంట్లోని బీరువా సామగ్రితోపాటు హోటల్‌సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో వృద్ధదంపతులు పోలీసులను ఆశ్రయించారు.


ధ్వంసమైన హోటల్ సామగ్రి

ఆరుగురిపై కేసు నమోదు

మూడపల్లి గ్రామంలో వృద్ధ దంపతులపై దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. నీరటి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగ్రహారంలోని ఇందిరానగర్‌కు చెందిన ఇడుగు రాములు, ఇడుగు వంశీ, ఇడుగు దేవవ్వ, చెలిమెల జ్యోతితోపాటు సిరిసిల్లకు చెందిన సంటి సుధాకర్, నాగరంకు చెందిన మ్యాకల రమపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రామకృష్ణకాలనీలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తిమ్మాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్, మండలంలోని రామకృష్ణకాలనీలో సోమవారం సాయంత్రం ఎల్ఎండీ ట్రైనీ ఎస్సై క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో, దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో ముఖ్యంగా యువతపై కలిగే శారీరక, మానసిక ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ఎండీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త


సూర అంజలి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్ల గ్రామంలో భార్యను భర్త హతమార్చిన సంఘటన చోటుచేసుకొంది. ఒకేగ్రామానికి చెందిన సూర అంజలి (27)కి రాజ్‌కుమార్‌తో పదేళ్లక్రితం వివాహమైంది. దంపతుల మధ్య ఎప్పుడూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం సాయంత్రం మామిడికాయల విషయంలో గొడవ జరిగింది. రాజ్‌కుమార్ కోపంతో భార్య అంజలిని గొంతునులిమి కిందపడేసి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి అంజలిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు పేర్కొన్నారు. అంజలికి ఇద్దరు కుమారులు సాత్విక్, రియాన్స్ ఉన్నారు. యేడాదిన్నర ఉన్న సాత్విక్ తల్లికోసం రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. మృతురాలితండ్రి సంపంగి మల్లేష్ ఫిర్యాదుమేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్‌కుమార్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన జింక అక్షయ్, కొండం ఋషి ఇద్దరు ద్విచక్రవాహనంపై వేములవాడకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో ఢీకొట్టింది. దీంతో అక్షయ్‌కి కాలు విరగగా ఋషికి స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరినీ వేములవాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుడు

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

జ్యోతినగర్, మే 19: (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ మేడిపల్లిసెంటర్ సమీపంలో పేకాటాడుతున్న స్థావరంపై సోమవారం పోలీసులుదాడిచేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారినుంచి 2,390రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

పుష్కరస్నానం పుణ్యఫలం



- ఐదో రోజున 60వేల మంది భక్తులు
- పుష్కర స్నానం చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు


కాళేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సరస్వతి.. నమోనమామి అంటూ వేల మంది పుష్కరాలకు తరలొస్తున్నారు. కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో అంతర్వాహిని చెంత పలు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు పుణ్యస్నానాలాచరించి.. ముక్తీశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం వచ్చి రాత్రి జరిగే సరస్వతీ నదీ హారతి వరకు ఉండి ఆ మహా ఘట్టాన్ని చూసి పరవశించిపోతున్నారు. ఐదో రోజైన సోమవారం 60 వేల మందికి పైగా భక్తులు పుణ్య స్నానా లు ఆచరించారు.

తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీవీఐపీల తాకిడి పెరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దంపతులు, నాసిక్‌త్రయం భికేశ్వర్ పీఠాధిపతి మహామండలేశ్వర స్వామిజీ, హై కోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు దంపతులు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి పుణ్య స్నానాలు ఆచరించి ముక్తీశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.

పుష్కరాలు ప్రారంభమై సోమవారానికి ఐదోరోజు కాగా.. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధికంగా వస్తారని అధికారులు అంచనా వేశారు. తొలి నాలుగు రోజులతో పోలిస్తే రద్దీ తక్కువగా కనిపించింది. ఈ క్రమంలో నాలుగు రోజుల్లో తలెత్తిన సమస్యలు, ఇబ్బందు లపై సమీక్షించుకున్న అధికార యంత్రాంగం ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుందన్న అంచనాలతో అధికారులు చలువపందిళ్లను మరి కొన్నింటిని పెంచారు.

● ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ..

శని, ఆదివారాల్లో తలెత్తిన ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఆదివారం ఉత్పన్నమైన సమస్యలను దృష్టిలోపెట్టుకుని జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను వేర్వేరు మార్గాల్లో నడిపించేందుకు కార్యాచరణ తయారుచేసింది. ఇందులో ఆర్టీసీ బస్సులను నేరుగా కాళేశ్వర క్షేత్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా ప్రైవేటు వాహనాలను అన్నారం క్రాస్ నుంచి చంద్రుపల్లి, పుస్కుపల్లి మార్గం మీదుగా మళ్లించాలని, లేదా కాటారం, గంగారం క్రాస్, దామెర కుంట మీదుగా కాళేశ్వరం వరకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.





స్నానాలాచరిస్తున్న భక్తులు

ఐదు రోజుల్లో రూ.57.04 లక్షల ఆదాయం

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయానికి ఆదాయం పెరిగింది. ప్రత్యేక దర్శనాల టికెట్లు, లడ్డూ, పులి హోర ప్రసాదాల విక్రయాల ద్వారా ఐదు రోజుల్లో దేవస్థానానికి 57.04 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. లడ్డూ పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నామని, భక్తులు సంతృప్తిగా కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారం రోజుల్లో కోటికి పైగానే ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అన్నారు.




పుణ్యస్నానాలాచరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



పుణ్యస్నానాలాచరిస్తున్న హైకోర్టు జడ్జి నందిగొండ నర్సింగారావు కుటుంబ సభ్యులు



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



వాహనాల పార్కింగ్

వారధిలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

సుభాష్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వారధి రిక్రూట్ మెంట్‌లోని అవకతవకలపై విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. వారధి పేర జిల్లా కేంద్రంలో ఉద్యోగుల దందా కొనసాగుతోందని, చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు వారధి సొసైటీని ఏర్పాటు చేశారని, ఈ సొసైటీ ఇపుడు అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని మండిపడ్డారు. లక్ష కొట్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం పట్టు అన్న చందంగా వారధి సొసైటీ తయారైందని విమర్శించారు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, సుమారు 400లకు పైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో పది మందిని ఎంపిక చేశారని, వారిలో ఇద్దరికి ఇతర ఉద్యోగాలు రావడంతో వదులుకున్నారని తెలిపారు. ఆ ఇద్దరి స్థానంలో మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సి ఉండగా అన్ని తానై చక్రం తిప్పుతున్న సంబంధిత అధికారి తన దగ్గరి వారికి ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు.

సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలి

తిమ్మాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయధికారులు సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలని జిల్లా వ్యవసాయధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని మొగిలిపాలెం, నల్లగొండలో వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్, భారతీయ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం, లుధియానా వారి సహకారంతో 120 మంది రైతులకు గడ్డి మందు, జింక్ సోమవారం పంపిణీ చేశారు. జిల్లా ఏఆర్ఎస్ అధికారి బి ఉషారాణి, ఏడీఏ శ్రీధర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు మధుకర్, శ్రావణి, విజయ్ భాస్కర్, మదన్ మోహన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేందర్ పాల్గొన్నారు.

నేడు టెక్స్‌టైల్ డిప్లొమా ప్రవేశాలపై సదస్సు

సిరిసిల్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందడానికి విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా జౌళి శాఖ అధికారి రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో 60 సీట్లు ఉన్నాయని ఇందులో ప్రవేశాలకు సంబంధించిన విధి విధానాలపై సిరిసిల్లలోని బీవైనగర్‌లో జౌళి శాఖ కార్యాలయంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పదవ తరగతి పాసై 15 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సుగల విద్యార్థులు హాజరు కావాలని కోరారు. సదస్సుకు టెస్కో మేనేజర్ అశోక్‌రావు, అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసవం



బిడ్డతో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

వేములవాడ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి సోమవారం మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. వేములవాడ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న జ్యోతిర్మయి 2023 సంవత్సరంలో ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ ద్వారా పాపకు జన్మనివ్వగా రెండోసారి అదే ఏరియా ఆసుపత్రిలో సోమవారం మగబిడ్డకు నార్మల్ డెలివరీ ద్వారా జన్మనిచ్చినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని పలువురు జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిని ప్రశంసిస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డీబార్

గణేశ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం ఐదుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ పాల్పడగా డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఆరో సెమిస్టర్‌లో శ్రీవాగ్దేవి డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, చాణక్య డిగ్రీ కళా శాల జమ్మికుంటలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, నాలుగో సెమిస్టర్‌లో శివాని డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

రాజీవ్ రహదారి విస్తరణ జరిగేనా?



పెద్దపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. ఈ రహదారిని ఆరు లైన్లకు విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.. ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీవ్ రహదారిని విస్తరించాలని కోరారు. ఈ రహదారికి చుట్టూ నేషనల్ హైవే రోడ్లు ఉండడంతో రద్దీ పెరిగి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫోర్‌లేన్‌తో ఈ రోడ్డును నిర్మించారు. ఈ నిర్మాణంలో జాతీయ రహదారుల నిర్మాణాల మార్గదర్శకాలను అనుసరించలేదు. రహదారిలో ఉన్న అనేక మలుపులు, ఆయా స్టేజీల వద్ద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లను, క్యాటిల్ అండర్ పాస్‌లను నిర్మించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్చి ఆరు లేన్ల రహదారిగా నిర్మిస్తామని కేంద్ర మంత్రులు ప్రకటిస్తున్నారు. అయితే ఈ రోడ్డు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి బదలాయింపు జరిగితేనే రోడ్డు విస్తరణ జరగనున్నట్లు తెలుస్తున్నది.

- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ
- రోజు సుమారు 50 వేల వాహనాల రాకపోకలు
- ఫ్లై ఓవర్లు, బైపాస్‌లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు

పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల, శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో సింగరేణి, సిమెంట్ పరిశ్రమలు, ఎన్టీపీసీ, ఎరువుల పరిశ్రమలు ఉన్నాయి. మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు గల రహదారిని డబుల్ లైన్ రోడ్డు విస్తరించాలని 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.735 కోట్లతో ప్రతిపాదించారు. ఫోర్‌లేన్ నిర్మించాలని అప్పటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయడంతో బీఓటీ (బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో హైదరాబాద్ శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి మంచిర్యాల జిల్లా ఇందారం వరకు ఎన్‌హెచ్ 63 కి అనుసంధానం చేస్తూ 1,565 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టి రాజీవ్ రహదారిగా నామకరణం చేశారు. 2009-10లో మొదలైన ఈ రహదారి 2014లో పూర్తయ్యింది. ఈ రహదారి ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల మీదుగా ఉంటుంది.

అత్యధికంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 150 కిలో మీటర్ల వరకు విస్తరించి ఉన్నది. ఈ రోడ్డులో పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, కరీంనగర్ జిల్లా రేణిగుంట, సిద్దిపేట జిల్లా దుద్దెడ వద్ద మూడు టోల్ ప్లాజాలు ఉన్నాయి. బీఓటీ పద్ధతిలో ఈ రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్ 30 ఏళ్ల వరకు టోల్ వసూలు చేసుకోవడంతోపాటు రోడ్డు నిర్వహణ చేయాల్సి ఉంటుంది. జాతీయ రహదారుల నిబంధనల ప్రకారం ఫోర్‌లేన్ రహదారిని 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు, మధ్యలో 4 నుంచి 5 మీటర్ల వెడల్పుతో డివైడర్ నిర్మించాల్సి ఉండగా నిబంధనల మేరకు నిర్మించలేదనే ఆరోపణలున్నాయి.

చాలా చోట్ల 35 నుంచి 40 మీటర్ల వెడల్పుతో, డివైడర్లను 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. ఈ రహదారికి కావాల్సిన భూ మిని కాంట్రాక్టు ఏజెన్సీ సేకరించలేదని, అండర్ పాస్, క్యాటిల్ పాస్ రోడ్లు, సర్వీస్ రోడ్లు, రహదారి గుండా ఎక్కడైనా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ బేలు లేవని, అవసరమైన చోట ఫ్లై ఓవర్లు నిర్మించలేదనే ఆరోపణలున్నాయి. పెద్దపల్లి, సుల్తానాబాద్, దుద్దెడ, కుకునూర్‌పల్లి వద్ద బైపాస్ రోడ్లు లేవు. ఈ రహదారిలో 60 చోట్ల మూల మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ

మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి రోజు వందల లారీల్లో బొగ్గు, ఇసుక, బూడిద, ఇటుక తరలుతున్నది. ఇతరత్రా సరుకులు కూడా రవాణా అవుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, కార్లు, టూ వీలర్ల రద్దీ రోజు రోజుకు పెరుగుతున్నది. రోడ్డు నిర్మించినప్పుడు ఈ రోడ్డు గుండా రోజుకు 10 వేల నుంచి 15 వేల వాహనాలు మాత్రమే ప్రయాణించగా, ప్రస్తుతం 40 నుంచి 50 వేల వాహనాలకు పైగా నడుస్తున్నాయి. ముందుందు ఈ రహదారిపై మరిన్ని వాహనాల రాకపోకలు పెరగనున్నాయి. ఈ రహదారి చుట్టూ జాతీయ రహదారులు ఉన్నాయి. దీంతో ఈ రహదారికి కనెక్టివిటీ బాగా పెరిగింది.

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు రైల్వే సౌకర్యం లేని కారణంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, కార్లలో హైదరాబాద్‌కు వెళుతున్నారు. టోల్ ప్లాజాల వద్ద, రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోందని, ప్రయాణంలో ఆలస్యం అవుతున్నదని వాహనదారులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని జాతీయ రహదారిగా మార్చి ఆరు లైన్లకు విస్త రించాలని 2017లో అప్పటి కరీంనగర్ ఎంపీ వినోద్ కుమార్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు.

30 ఏళ్ల వరకు టోల్ ప్లాజా ఒప్పందాలు ఉండడంతో కాంట్రాక్టర్‌కు తగిన పరిహారం చెల్లించి ఆరులైన్ల రహదారిని చేపట్టాలని కేంద్రాన్ని కోరినప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఈ నెల 5వ తేదీన ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ రహదారులను ప్రారంభించేందుకు కేంద్ర జాతీయ రహదారుల, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వచ్చారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీవ్ రహదారిని విస్తరించాలని మంత్రిని కోరారు. ఈ రహదారి విస్తరణకు 2,232 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. సికింద్రా బాద్ పారడైజ్ నుంచి ఓఆర్ఆర్ జంక్షన్ వరకు 18.10 కిలోమీటర్ల వరకు ఫోర్‌లేన్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గతేడాది సీఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ క్రమంలో రాజీవ్ రహదారిని విస్త రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జాతీయ రహదారిగా నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

వేములవాడ క్షేత్రం
భక్తజన సంద్రం

- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం
- క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు
- 70 వేలకుపైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు



దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. రాజన్న క్షేత్రానికి భక్తులు సుమారుగా 70 వేలకు పైగా దర్శనానికి వచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్న దర్శనం కోసం భక్తులు ధర్మదర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లలో సుమారుగా నాలుగు గంటలు నిరీక్షించి ఆలయంలోకి చేరుకోగా శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులు తీరి రాజన్న ఆలయంలోకి ప్రవేశించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో బ్రేక్‌దర్శనం క్యూలైన్ నిరంతరం కొనసాగించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు ఆలయంలోకి ప్రవేశించి ముందుగా శ్రీలక్ష్మీగణపతిని, శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీపార్వతిదేవి అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం సమర్పించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు క్యూలైన్‌లు త్వరితగతిన కదిలేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ గుడిచెరువు పార్కింగ్ స్థలంలో వాహనాలతో నిండిపోయి కనిపించింది.



భక్తుతో కిక్కిరిసిన ప్రాంగణం

ఫిట్స్‌తో పడిపోయిన భక్తుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు ఫిట్స్‌తో క్యూలైన్‌లో కిందపడి పోయాడు. గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే ఆసుపత్రికి తరలించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, మే 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి బిల్వార్చన చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేశామని, అండర్-25 విభాగంలో మొదట లీగల్ పద్ధతిన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జూన్‌లో హైదరా బాద్‌లో జరిగే హెచ్‌సీఏ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని, ఆ ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. అండర్-19, అండర్-16, అండర్-14 విభాగాల్లో కూడా ఆరు జట్ల చొప్పున ఎంపిక చేశామని, వీటికి విడతల వారీగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న అండర్-25 క్రికెట్ లీగల్ పోటీలను మొదట కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ మైదానంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానం, వేములవాడలో జూన్ 6వ తేదీ వరకు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్. మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కె.మహేందర్‌గౌడ్, సంఘం సభ్యులు అజిత్ కుమార్, హరికృష్ణగౌడ్ పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీగలగుట్టపల్లి వికాసతరంగిణి శాఖ-07 ఆధ్వర్యంలో 108 గోవింద నామాలతో కూడిన కరపత్రాన్ని ఆలయ చైర్మన్ శ్రీరాం భద్రయ్య, వికాసతరంగిణి, ప్రజ్ఞ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో ఆర్డినేటర్ శేఖర్‌రావు ఆవిష్కరించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని కురుమవాడ బాల భక్తాంజనేయస్వామి దేవాలయంలో అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సంపత్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులకు చేపట్టిన అన్న ప్రసాద వితరణ కొనసాగుతోంది. మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి, ఎలుకపెల్లి శివశంకర్-సుష్మ దంపతులు, కుమారులు మల్లికార్జున్, రాధాకృష్ణ దాతలుగా వ్యవహరించారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో 20, 21, 22 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రామాచార్యులు ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నల్లగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత మేళాని ప్రథం ఎన్‌జీవో ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ సీడీపీవో సబితా కుమారి పాల్గొన్నారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఒక కేసుకు సంబంధించి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌కు ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్లు అర్బన్ ఎక్సైజ్ సీఐ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలమని పేర్కొ న్నారు.

సుభాష్‌నగర్: అందాల తారలు ఏం చేశారని వారికి 30 తులాల బంగారం ఇస్తామంటున్నారని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు కర్రె పావని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచ సుందరీమణుల కోసం కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.

భగత్‌నగర్: అల్గునూరు సీఈవో నుంచి బాయ్స్ హాస్టల్ పిల్లలను వేరే హాస్టల్‌కు తరలించవద్దని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో చింత కుంటను బాలికల కోసం, ప్రస్తుత సీఈవోని బాలుర కోసం నడిపితే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

నిలిచిన రహదారుల పనులు

- మంజూరుకాని బిల్లులు
- రెండేళ్లుగా కంకర రోడ్డుపై ప్రయాణం
- రాకపోకలకు ప్రజల ఇక్కట్లు


మొగ్దుంపూర్‌లో కంకర పోసి బీటీ వేయని రహదారి

కరీంనగర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రారంభించిన బీటీ రోడ్ల పనులు నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం బిల్లులను మంజూరు చేయడం లేదన్న కారణంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు రెండేళ్లకు పైగా కంకర దారులపైనే ప్రయాణం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు కంకర రోడ్లపై అవస్థలు పడుతున్నారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్-ఎలబోతారం వరకు రూ.2కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో బీటీ రోడ్డు పనులను 2022 ఆగస్టులో ప్రారంభించారు. మొగ్దుంపూర్ సబ్ స్టేషన్ నుంచి పొలాల మీదుగా ఇరుకుల్ల ఎస్సారెస్పీ కాలువ నుంచి ఎలబోతారం వరకు రోడ్డు పనులు చేపట్టారు. పీఆర్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో రోడ్డును ఇష్టారాజ్యంగా నిర్మించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుల్ల సమీపంలో రోడ్డు ఎత్తుగా ఉండడంతో పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భూములను దున్నేందుకు ట్రాక్టర్లు, కేజీవీల్స్, వరి కోత సమయంలో హార్వేస్టర్లు, ట్రాక్టర్లను తీసుకెళ్లడం రైతులకు ఇబ్బందిగా మారింది. పలు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ఇదేవిధంగా చెర్లబూత్కూర్ నుంచి దుబ్బపల్లి మూడు కిలోమీటర్ల రోడ్డు, బహదూర్‌ఖాన్‌పేట గ్రామంలోని రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం లేదన్న కారణంతో సబ్ కాంట్రాక్టర్ ఏడాది క్రితం కంకర పోసి, పనులు నిలిపివేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలైనా బిల్లులు మంజూరు చేయకపోవడంతో రోడ్ల పనులు ముందుకు సాగడం లేదు. మొగ్దుంపూర్, ఇరుకుల్ల, చెర్లబూత్కూర్, ఎలబోతారంతోపాటు, బహదూర్‌ఖాన్‌పేట గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఐక్యతే మున్నూరుకాపుల ఆయుధం


సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య

కరీంనగర్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధనకు ఐక్యతే మౌలిక ఆయుధమని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ పటేల్ అన్నారు. సోమవారం నగరంలోని హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పటేల్ గెజిట్ సాధన లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా మున్నూరుకాపులందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. త్వరలో రాష్ట్రస్థాయిలో మున్నూరుకాపు సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రావు, రెడ్డి అనే పదాలు మున్నూరుకాపుల పేర్లకు ఉండడంతో జనగణనలో సంఖ్య తక్కువగా నమోదవడం అన్యాయమన్నారు. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చొరవ చూపాలని కోరారు. టీఎంకేజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్‌పటేల్, రాష్ట్ర లీగల్ కన్వీనర్ ఒంగెల రత్నాకర్ పటేల్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సమస్యలను పరిష్కరించాలని మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్ జమీల్ ఉద్దీన్ అహ్మద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు కోరారు. సోమవారం ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన కరెంటు ఎక్స్‌టెన్షన్ లైన్ పనులను, మెడికల్ కళాశాల కోసం మంజూరు చేసిన సబ్‌స్టేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన రూ.6.41 కోట్ల నిధులు కరీంనగర్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారని, నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని అన్నారు. అలాగే ట్రాక్టర్లకు వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు.

సుందరీకరణ పనులు చేపట్టాలి

కరీంనగర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని నందమూర్తి తారక రామారావు విగ్రహ ప్రాంగణ సుందరీకరణ పనులు చేపట్టాలని టీడీపీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కళ్యాడపు ఆగయ్య కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ విగ్రహ ప్రాంగణంలో శాతవాహన యూనివర్సిటీ బోర్డు, మరక హాస్పిటల్ బోర్డులు ఏర్పాటు చేశారని, వాటితో ప్రాంగణానికి అడ్డంకిగా మారి కళ తప్పుతోందని, వెంటనే తొలగించాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

కరీంనగర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, సానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్, రెవెన్యూ విభాగాల చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సెక్షన్ వారిగా ప్రజావాణి దరఖాస్తుల సమస్యలపై ప్రత్యేక రిజిస్టర్ నమోదు చేయాలని, సమస్యకు సంబంధించిన స్టేటస్ వివరాలను అందజేయాలని అన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ

కరీంనగర్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో కాళీయ మర్దన శ్రీకృష్ణుడు, ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణానికి చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లోని నూతన విగ్రహాలకు పడాల రాజు-మాలతి, పడాల సంతోష్-హారిక దంపతులు రూ.2లక్షల 50 వేల అందజేసినట్లు తెలిపారు. ధర్మ కర్తల మండలి సభ్యులు సత్యనారాయణ, కవిత, కృష్ణ, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సీలింగ్ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలోని కొంతమంది అవినీతి అధికారులు సీలింగ్ ల్యాండ్ కేసు విచారణను తొక్కిపెట్టి, యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేయడం ప్రారంభించారు. దీంతో 476 డాక్యుమెంట్లు చేతులు మారాయి. ఈ క్రమంలో లోకాయుక్తా తిరిగి విచారణ వేగవంతం చేసింది. నిషేధం ఉన్న భూముల్లో రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతున్నాయని గమనించి 2024లో మళ్లీ రెవెన్యూశాఖను హెచ్చరించింది. తక్షణం రిజిస్ట్రేషన్లు నిలిపివేయాల్సిందిగా రిజిస్ట్రేషన్ల శాఖను ఆదేశించమని రెవెన్యూశాఖకు సూచించింది. ఇప్పటి వరకు చేసిన లావాదేవీలన్నింటినీ రెండు రోజుల్లో రద్దు చేయాలని కరీంనగర్ ఆర్డీవో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు 2024 నవంబరు 14న లేఖ రాశారు. ఆర్డీవో లేఖ రాసి ఆరు నెలలు గడిచినా రిజిస్ట్రేషన్ల శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదే విషయాన్ని ఆర్డీవో లోకాయుక్తాకు తెలియజేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన లోకాయుక్త తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించింది. రంగంలోకి దిగిన కలెక్టర్ పమేలా సత్పతి కొత్తపల్లిలోని సర్వేనంబర్లు 175, 197,198లో ఉన్న భూముల్లో ఇప్పటివరకు జరిగిన మొత్తం రిజిస్ట్రేషన్లను రద్దు చేయా ల్సిందిగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా భూముల్లో జరిగిన 476 డాక్యుమెంట్లు తక్షణం రద్దు కానున్నాయి. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో ఉన్న భూముల వివరాలను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు, రెవెన్యూ శాఖకు అందించింది. ఆ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని ఎప్పటి కప్పుడు ఆ శాఖని హెచ్చరించింది. 1998, 2011, 2016, 2017, 2018లో ఎనిమిదిసార్లు రిజిస్ట్రేషన్ శాఖను రెవెన్యూ శాఖ అప్రమత్తం చేసింది. రిజిస్ట్రేషన్ల శాఖలోని కొంతమంది అవినీతి అధికారుల కారణంగా ఆ భూముల్లో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగాయి. వందలాది డాక్యు మెంట్లు చేతులు మారాయి. రిజిస్ట్రేషన్ల శాఖ నిర్లక్ష్యం, అవినీతి అధికారుల బరితెగింపు వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌లో ఉన్న ప్రభుత్వ భూములని తెలియక భూములు కొన్న సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు, రూరల్, ఏడీఈలు లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 9 వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తాహెరా మసీద్ ప్రాంతం, దోబీఘాట్, ఏపీఎస్ పార్క్‌కాలనీ, ఉదయం 8 గంటల నుంచి 11 వరకు రేకుర్తి, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్ల గుంట పల్లి, చెర్లబూత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, ఫకీర్ పేట, జూబ్లీ నగర్, బహదూర్‌ఖాన్‌పేట్, తహెర్ కొండాపూర్, ఎలబోతారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తాం


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో జిల్లాలో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సోమవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ సుందరయ్య పేదల పక్షపాతిగా తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సత్యం, భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలోని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, జిల్లా సహాయ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ పట్టణంలో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నాయని, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

కరీంనగర్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్ లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. యజ్ఞాచార్యులు వానమామలై పవనకుమారాచార్యుల బృందం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు పూజలు చేశారు. అనంతరం ఎన్నమనేని ప్రకాశరావు-నిహారిణి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం శ్రీవారు రథంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమాన్ మాలధారుల పాదయాత్ర

కరీంనగర్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా నాలుగు రోజల ముందు నుంచే హనుమాన్ మాలధారులు వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆంజనేయస్వామి క్షేత్రాలకు వెళ్తుండగా మరికొందరు వాహనాల్లో విజయవాడ, భద్రాచలం, తిరుపతి-జాబాలి వంటి పుణ్య క్షేత్రాలకు బయల్దేరారు. రాత్రి వేళల్లో, అలసట అయినప్పుడు ఆలయాల్లో ఆగి భిక్ష స్వీకరిస్తున్నారు. తిరిగి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం నుంచి రాత్రి వరకు యాత్రలు కొనసాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం లేదా గురువారం ఉదయం వరకు ఆయా క్షేత్రాలకు చేరుకోనున్నారు.

నేడు మండలంలో పర్యటించనున్న మంత్రులు

సైదాపూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సైదాపూర్ మండలంలో పర్యటించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయవర్గాలు ఒకప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా సాయంత్రం 4గంటలకు ఘన్‌పూర్‌గ్రామంలో నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సులో మంత్రులు పాల్గొని రైతులకు భూభారతి చట్టం-2025పై అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

శంకరపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాపూర్‌లోని వాలీ సుగ్రీవాంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం సోమవారం కన్నులపండువగా జరిగింది. ఈసందర్భంగా వేదపండితులు మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. అనంతరం ఆయనను అర్చకులు సన్మానించి, ఆశీర్వదించారు. అలాగే గ్రామంలోని పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 68క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ అధికారులు దగ్గరుండి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిస్తాం

జమ్మికుంట రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పీడితవర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్ అన్నారు. సోమవారం జమ్మికుంటలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల రమేష్, వడ్లూరి కిషోర్, సిరికొండ మధునయ్య, మారపల్లి కిరణ్, తెడ్ల మహేందర్, చల్ల సాగర్, శ్రీనివాస్, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రామడుగు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట ఊరపోచమ్మ దేవాలయంలో ఘనంగా విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నేచర్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో యథేచ్ఛగా కబ్జాలు

హుజూరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు యథేచ్ఛగా కబ్జా చేస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గంగోని కుంట శిఖంభూమి, బొట్టోనికుంట, కట్టు కాలువతోపాటు వరంగల్ రోడ్డును ఆనుకొనిప్రహించే చిలుకవాగును ఇరువైపులాకబ్జా చేశారన్నారు. అధికారులు చర్యలు తీసుకోనియెడల సీఎంవోలో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

శంకరపట్నం తహసీల్దార్‌గా సురేఖ

శంకరపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం తహసీల్దార్‌గా సురేఖ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా కోహెడ మండలం నుంచి బదిలీపై శంకరపట్నం తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం: ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులను నిలిపివేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. మండలంలోని లింగాపూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి ఆయన సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యతోపాటు వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. లింగాపూర్‌లో పీహెచ్‌సీ నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.20లక్షలను మంజూరు చేసిందన్నారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. అంతకుముందు మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాలలో రూ.13.50లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, వైస్‌చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎన్. రవీంద్రాచారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు వెంకటేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగాల్లో రాణించాలి..

తిమ్మాపూర్: విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ గది నిర్మాణపనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌ఎల్ గౌడ్, మండల అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

అనర్హులను ఎంపిక చేసి అభాసుపాలు కావొద్దు

శంకరపట్నం: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అనర్హులను ఎంపికచేసి అభాసుపాలు కావొద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. సోమవారం శంకరపట్నం మండలకేంద్రంలోని రైతువేదికలో 60మంది లబ్ధిదారులకు రూ. 15.49లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తొలిదఫా జాబితాలో పేర్లులేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మరోవిడతలో తప్పకుండా చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్‌గౌడ్, ఏవో వెంకటేష్, పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.


శంకరపట్నంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మారని మండల రెవెన్యూ అధికారుల తీరు

వీణవంక, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ అధికారుల తీరు మారడంలేదు. గతంలో మండల కేంద్రంలో ఓభూమికి సంబంధించి యజమానికి తెలియకుండా కొంతమందితో కలిసి దొంగ పట్టాలు చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నుంచి అటెండరువరకు పూర్తి సిబ్బందిని బదిలీచేయడం అప్పట్లో రాష్ట్రంలో సంచలనం రేపింది. అధికారులనైతే బదిలీ చేశారు కానీ అసలు వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం నూతనంగా వచ్చిన సిబ్బందిని సైతం సదరు వ్యక్తులు తమ కార్యకలాపాలకు వినియోగించుకుంటు న్నారు. దీనితో తహసీల్దార్ కార్యాలయ పనితీరు మారడంలేదని మండల ప్రజలుచర్చించుకుంటున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేపట్టినప్రజాపాలనలో మండలంలో నూతనంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని పంచాయతీకార్యదర్శులు సర్వే నిర్వ హించి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేశారు. నూతన రేషన్‌కార్డు, నూతనసభ్యుల చేర్పులు, మార్పులకోసం కార్యాలయాల చుట్టూ కాళ్లఅరిగేలా తిరిగినా దరఖాస్తు ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందోతెలియడం లేదని వాపోతున్నారు. రేషన్‌కార్డుల వివరాలపై వీణవంక డిప్యూటీ తహసీల్దార్‌ను వివరణకోరగా ప్రజాపాలన దరఖాస్తులతో తమకు సంబంధం లేదని వాటి వివరాలు మాకు తెలియదని తెలిపారు. మీ సేవలలో దరఖాస్తు చేసిన వారివివరాలు మాత్రమే మాదగ్గర ఉంటాయని బదులిచ్చారు. ప్రజాపాలనలో దరఖాస్తుచేసిన వాటి వివరాలను ఉన్నతాధికారులనుఅడిగితెలుసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్సీగా ఉండి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఒక్కటైనా పంచాడా?

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్‌గా ఉన్న సమయంలో పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఒక్కటైనా పంచాడా అని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ప్రశ్నించారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇంది రమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో పారదర్శకత పాటించామని, నియోజకవర్గంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లు మా దృష్టికివస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకుండా నిలిపివేస్తామని హెచ్చరించారు. మరోరెండు మూడ్రోజుల్లో రెండోవిడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కూడా ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులతో వొడితెల ప్రణవ్

● కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 57మందిలబ్ధిదారులకు రూ.22,48,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వొడితెల ప్రణవ్‌పంపిణీ చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

చిగురుమామిడి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికిచెందిన ముత్యాల కొమురయ్య అనే రైతుకుచెందిన వ్యవసాయ బావివద్ద సోమవారం రాత్రిజరిగిన విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, రైతు కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమురయ్య పశువుల పాకముందు నుంచి వెళ్తున్న 11కేవీవిద్యుత్ వైర్లు ఒకదానికొకటి తాకడంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న గడ్డివాము అంటుకుంది. దీంతో 1200గడ్డికట్టలు దగ్ధమయ్యాయి. పక్కనేఉన్న పాడిఆవుకు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది.

పశువులపాక పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పారు. ఐదులక్షల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో గల యేదుగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పొలాడి రామారావు, , భక్తులు పాల్గొన్నారు.

పంచశీల జెండా ఆవిష్కరణ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ లెదర్‌పార్కు సాధనసమితి ఆధ్వర్యంలో బుద్ధ పంచశీల జెండాను ఆవిష్కరించారు. బుద్ధ జయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించారు.

మాజీ ఎంపీ పరామర్శ

గంగాధర: బీఆర్‌ఎస్‌నాయకుడు నాగారపు సత్యనారాయణను సోమవారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మాజీసర్పంచ్ సత్యనారాయణ నెలక్రితం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ యశోదలో వైద్యం పొందాడు.

మినీస్టేడియం ఏర్పాటు చేయాలి

రామడుగు: మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మండల వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి జిల్లాకలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

విద్యార్థికి అభినందన

రామడుగు: జేఎన్‌టీయూ అనంతపూర్ ఏపీఈసెట్‌లో ఫస్ట్‌ర్యాంకు సాధించిన పెద్దిగారి రాకేష్‌ను సరస్వతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ హెచ్‌ఎం ఉప్పలశ్రీనివాస్, కోరస్పాండెంట్ ఉప్పల సత్యం సోమవారం అభినందించారు.

వినతిపత్రం అందజేత

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్‌గ్రామానికి చెందినకోడూరు సమ్మయ్య తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాస మితి హిందూ జ్ఞానవేదిక హుజూరాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైతసిద్ధాంత జ్ఞానగ్రంథాల ప్రచారం నిర్వహించారు.